క్లుప్తంగా

కొలువుదీరిన పీర్లు



అంబవరంలో కొలువుదీరిన పీర్లు

కాశినాయన: మండలంలోని అంబవరం గ్రామంలో వెలసిన పెద్దపీరయ్య స్వామి పీర్ల చావిడిలో ఆదివారం పీర్లు కొలువుదీరాయి. మత సామరస్యానికి మొహర్రం పండుగ ప్రతీక అని పీఠాధిపతి మహబూబ్‌వలి తెలిపారు. భక్తిశ్రద్ధలతో నాలుగు రోజులు ఈ పండుగను నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. జూలై 4న చిన్న సరిగేసు, 6వ తేదీన పెద్ద సరిగేసు, 7వ తేదీన పీర్లు బావికి వెళుతాయని తెలిపారు. పీర్లు బావికి వెళ్లే రోజున చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొంటారని చెప్పారు.

ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలి



పోస్టర్లు అంటిస్తున్న సీపీఎం నాయకులు

బద్వేలు అర్బన్ : ట్రూ ఆఫ్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు ముడియం చిన్ని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే ఆపాలని సీపీఎం రాష్ట్ర కమిటీ ముద్రించిన పోస్టర్లను ఆదివారం పట్టణంలో ఇంటింటికి అంటించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం ఇష్టానుసారంగా వేసిన యూజర్ చార్జీలను తగ్గిస్తామని అప్పట్లో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు ఇప్పుడు సెకీ ఒప్పందాన్ని ఉపసంహరించుకుని యూజర్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు మస్తాన్ షరీఫ్, శాఖ కార్యదర్శులు షేక్ ఆదిల్, ముడమాల ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇటుకలపాడులో ఎమ్మెల్సీ పర్యటన



నాయకులతో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కాశినాయన : మండలంలోని ఇటుకలపాడు గ్రామంలో శ్రీముచ్చుకుందేశ్వర జ్ఞాన ప్రసూనాంబ దేవాలయంలో శ్రీపార్వతి పరమేశ్వరుల శివాలయ పునః నూతన విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు జరిగి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నశేషయ్య, ఆదినారాయణరెడ్డి, బాలయ్య, కొండయ్య, రమణయ్య, చిన్నయ్యల ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి విందులో పాల్గొన్నారు. గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆయన పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, జిల్లా సెక్రటరీ యాక్టివేట్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, అక్కంపేట రమణారెడ్డి, హుస్సేన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, గురివిరెడ్డి, పులివీడు సర్పంచ్ రఘునాథరెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న మన ప్రజా సేవా సమితి సభ్యులు

చాపాడు: మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కందనూరు నాయబ్ రసూల్‌ను ఆదివారం మన ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇంటి వద్ద సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మన ప్రజా సేవా సమితి వ్యవస్థాపకులు ఎండీ అయూబ్ ఖాన్, సభ్యులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప మండలాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, చాపాడు మాజీ సర్పంచ్ అక్బర్, నారాయణరెడ్డి, మన ప్రజా సేవా సమితి గౌరవ సలహాదారుడు ఎస్పీ ముక్తియార్, ఉపాధ్యక్షులు బిటెక్ బాషా, డీసీఎస్ఆర్ వార్డు మెంబర్ సాబిర్, మోహమూద్, యూసఫ్, గౌస్, మహేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాయజ్ఞం పరిసమాప్తం

కడప సెవెన్‌రోడ్స్: లోక కల్యాణార్థం కడప బ్రాహ్మణవీధిలోని ఉత్తరాదిమఠంలో నిర్వహించిన దశకోటి కృష్ణమంత్ర జప మహాయాగం, సరస్వతీ మహాయాగం ఆదివారంతో ముగిసింది. ఆదివారం ఉదయం 9.30 గంటలకు పూర్ణాహుతి, అనంతరం సభా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు సరస్వతి కంకణ ధారణ, పుస్తకాలు, పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు. మైసూరుకు చెందిన రామచంద్రాచార్, విద్యానిధి ఆచార్, పాండు రంగచార్, శ్రీనిధిచార్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

పసుపు సాగు వైపు.. అన్నదాతల చూపు

- కోటి ఆశలతో సాగుకు సన్నద్ధం
- పెరగనున్న పంట విస్తీర్ణం
- ఏటా పెరుగుతున్న ఖర్చులు



చాపాడులో పసుపు పంటను సాగు చేస్తున్న రైతులు

చాపాడు: మార్కెట్‌లో ఆశించిన ధర రాకున్నా... ప్రభుత్వం మద్దతు ధర అందించకున్నా... ఏ యేటికి ఆ యేడు సాగు ఖర్చులు పెరుగుతున్నప్పటికీ మైదుకూరు నియోజకవర్గంలో రైతులు పసుపు సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. ఒక సీజన్‌లో కాకపోతే మరొక సీజన్‌లోనైనా ధర వస్తుందని ఆశించి సాగు చేస్తున్నారు. దీనికి తోడు పలు రైతు కుటుంబాలు పసుపు పంటను ఇంటి పంటగా, లక్ష్మీ పంటగా భావిస్తూ వస్తున్నారు. దీంతో తమకున్న భూమిలో కొంతైనా పసుపు సాగు చేస్తుండడం ఆనవాయితీగా వస్తోంది.

మైదుకూరు నియోజకవర్గంలో..

మైదుకూరు నియోజకవర్గంలో గతేడాది 2,402 ఎకరాల్లో రైతులు పసుపు సాగు చేశారు. ఈ ఏడాది 2,759 ఎకరాల్లో రైతులు పసుపు సాగు చేయవచ్చని ఉద్యానశాఖాధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలో బ్రహ్మంగారిమఠం మండలం మినహా మిగిలిన మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, చాపాడు మండలాల్లో ప్రతి మండలంలో 400 ఎకరాలకు పైగా పసుపు సాగు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే 40శాతం వరకూ రైతులు సాగు చేశారని, మిగిలిన రైతులు విత్తనం కోసం సమాయాత్తమవుతున్నారు. ప్రతి ఏడాది మైదుకూరు మండలంలో 1,000 ఎకరాల వరకూ ఆయా గ్రామాల్లోని రైతులు పసుపు సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. వనిపెంట, నంద్యాలంపేట, మైదుకూరు సమీప గ్రామాల్లో రైతులు పసుపు సాగుపై దృష్టి సారిస్తారు.

ధరలు అంతేంతే..

పసుపు సాగు చేసే రైతన్నకు ప్రతి ఏడాది సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. ధరలు పెరగకపోయినప్పటికీ సాగు ఖర్చులు మాత్రం పెరుగుతున్నాయి. విత్తనం, ఎరువులు, పురుగుల మందులు, సాగు ఖర్చులు ఏడాది పెరుగుతూనే ఉన్నాయి. ఎకరా సాగు కోసం రూ.1.10లక్షలు అవుతుందని, ఇదే క్రమంలో కౌలు రైతులు దీనికి అదనంగా రూ.40వేలు ఖర్చు అవుతుంది. కౌలు భూమికి ముందుగానే ఎకరాకు రూ.40వేలు చొప్పున చెల్లించాలి. విత్తన పసుపు ఎకరాకు 5 పుట్లు అవసరం కాగా, పుట్టి రూ.7వేలు చొప్పున రూ.35వేలు ఖర్చు చేయాల్సి ఉంది. ఇక సాగు ఖర్చులు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు, 9 నెలల పాటు పంట సాగు ఖర్చులు లక్ష వరకూ వస్తాయి. ధరలు చూస్తే ప్రతి ఏటా పెరుగుదల ఉండవు. 2023–24లో క్వింటా ఒట్టి పసుపు రూ.14–15వేలు ఉండగా, 2024–25లో ఈ ఏడాది రూ.9–10వేల వరకూ మాత్రమే పలికింది. అయితే పంట దెబ్బతినకుండా దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సీజన్‌లో ధరలు పెరుగుతాయనే ఆశలో పసుపు పంట సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

> **వ్యవసాయాన్నే నమ్ముకున్నాం**
>
> వ్యవసాయమే మాకు జీవనాధారం. ప్రతి ఏడాది వరి సాగుతో పాటు పసుపు పంటను సాగు చేస్తాను. ఈ ఏడాది రెండేకరాలు పసుపు విత్తనం వేశాను. ఈ సీజన్‌లో ధర పెరిగితే రైతులు మేలు జరుగుతుంది. పసుపు పంటను 9 నెలల పాటు కంటిరెప్పలా కాపాడుకోవాలి.
>
> – ఆర్.మనోహర్‌రెడ్డి, రైతు, చాపాడు గ్రామం, మండలం

తైక్వాండో బెల్ట్ టెస్ట్‌లో సత్తా



తైక్వాండోలో బెల్ట్‌లు సాధించిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లోని జవహర్ బాలకేంద్రం విద్యార్థులకు ఆదివారం తైక్వాండో శిక్షణలో భాగంగా బెల్ట్ గ్రేడ్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు కిక్కింగ్, పంచెస్, స్పారింగ్, కటాస్, బ్రేకింగ్, సెల్ఫ్ డిఫెన్స్, టెక్నిక్స్ విభాగాలల్లో శారీరక దృఢత్వం, మానసిక సామర్థ్యం పరీక్షలు నిర్వహించారు. ఎల్లో బెల్ట్ టెస్ట్ విభాగంలో ప్రణీత, దక్షిత, గేత్రి, మనుదీప్, ఆరీఫ్, నిత్విక్, సుకీర్తన, ఎల్లో–1 విభాగంలో గౌరీస్ కుమార్, దక్షీస్ కుమార్, సాజిత, లోహితా, బ్లూ బెల్ట్ విభాగంలో జాహ్నవి, యోజిత, హేమంత్, అభిరామ్, కార్తవ్, రెడ్ బెల్ట్ విభాగంలో యువరామ్, పునీత్ రెడ్డి ప్రతిభకనబరచి బెల్ట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారని మాస్టర్ మునీశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా మాస్టర్ మునీశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచినట్లు తెలిపారు. పిల్లలకు చిన్న వయసులోనే సరైన శిక్షణ ఇవ్వగలిగితే జాతీయ స్థాయిలో రికార్డులు సాధిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ఈ క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. క్రీడల వలన ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులు విద్య, ఉద్యోగాల్లో ప్రయోజనం పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీర్లచావిడిలో ప్రార్థనలు

కడప ఎడ్యుకేషన్: మొహర్రంను పురస్కరించుకుని కడప పెద్ద దర్గాలో పీర్ల చావిడి వద్ద ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మైనార్టీ నాయకుడు లయన్ పటాన్ ఖాదర్‌బాషా పాల్గొని మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా హిందూ ముస్లిలంతా స్నేహభావంతో మొహర్రం జరుపుకొంటారన్నారు. కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

దేశ పురోగతికి అంబేడ్కర్ ఆశయాలే స్ఫూర్తి



మాలమహానాడు నాయకులతో జాతీయ మహిళా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి

ప్రొద్దుటూరు కల్చరల్ : దేశ పురోగతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు స్ఫూర్తి అని మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం ఆమె పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అంబేడ్కర్ అందరికీ ఆప్తుడని తెలిపారు. అయన విగ్రహాన్ని ధ్వంసం చేయడం, అవమానపరచిన సంఘటనలను ఆమె ఖండించారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు భాస్కర్, జిల్లా యూత్ లీడర్ రాజేష్, జిల్లా కార్యదర్శి సునీల్, పట్టణాధ్యక్షుడు పవన్, స్వరూప్, వీర కిరణ్‌కుమార్, కల్యాణ్ బాబు, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ముత్యాల ప్రసాద్‌రావు, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

అవమానం జరిగితే సహించం

పోరుమామిళ్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు చాలాచోట్ల అవమానం జరుగుతున్నదని అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి కోరారు. ఆదివారం ఆమె పోరుమామిళ్లలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించి దేశానికి గొప్ప సేవ చేసిన మహానుభావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మాల మహానాడు నాయకులు వీరయ్య, విజయ్, కేశవ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు వైవీయూ డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభకనబరిచారని కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ తెలిపారు. ఏడుగురు విద్యార్థులు 10కి 10 జీపీఏ సాధించారని ఆయన పేర్కొన్నారు. నాలుగో సెమిస్టర్ బీఎస్సీ జువాలజీలో తేజస్విని, లక్ష్మీ లాలస, మంజులత, 10 జీపీఏ, తస్లీం, చందన 9.7, బీఎస్సీ బయోటెక్నాలజీలో జ్ఞానశ్రీ 10 జీపీఏ, తన్మయ 9.7, శ్రావణి, ఫర్హా 9.55, బీసీఏలో హర్షిత 9.65, ఆయేషా 9.25, యాస్మిన్ ప్రవల్లిక 9.20, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో లక్ష్మీప్రసన్న 9.65, శ్రీప్రియ 9.15, బీకాం కంప్యూటర్స్‌లో హసీనా 9.30, హసీనా, పరిమళ 9.10 జీపీఏ, 2వ సెమిస్టర్ ఫలితాల్లో బీఎస్సీ జువాలజీలో సబీనా, ముష్కాన్ 10 జీపీఏ, సహానా, గౌసియా, సుప్రియ 9.75, బీఎస్సీ బయోటెక్నాలజీలో బ్లెసీనా 9.56, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో దీవెన, నాగరచన 8.92, బీకాం కంప్యూటర్స్‌లో హారిక 9.08, సాయి వైష్ణవి 8.83 జీపీఏ సాధించారని వివరించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ, డైరెక్టర్ పృథ్వీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ శారద భవాని, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామ్మోహన్, అధ్యాపకులు గౌరీశంకర్, మౌనయ్య, అజ్రా, భవాని అభినందించారు.

సగిలేరు గురుకుల పాఠశాలను తరలించడం తగదు



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పోరుమామిళ్ల: సగిలేరు ప్రాజెక్టు సమీపంలో 30 సంవత్సరాలుగా కొనసాగుతున్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలను బి. మండలానికి తరలించడం తగదని, బద్వేలు నియోజకవర్గంలో ఉన్న ఏకైక గురుకుల పాఠశాల విద్యార్థులను మైదుకూరు నియోజకవర్గంలోని తోట్లపల్లె మహాగురుకుల పాఠశాలకు తరలించడం మంచిది కాదని వివిధ సంఘాల నేతలు పేర్కొన్నారు. ఆదివారం మానవహక్కుల సంఘం నేతలు గంగన్న, ఫణిరావు, పీసీసీ సభ్యులు అన్వర్ మాట్లాడుతూ సగిలేరు గురుకులాన్ని తరలిస్తే పోరుమామిళ్ల, బి. కోడూరు, కాశినాయన, కలసపాడు మండలాలకు చెందిన విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు.

ఆందోళన చేస్తాం

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠం మిట్టమానుపల్లె రోడ్డులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను తరలించాలని అధికారులు చూస్తున్నారని సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు పెదుల్లపల్లె ప్రభాకర్, గండి సునీల్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తోట్లపల్లెదగ్గర నూతనంగా నిర్మించిన మహాగురుకులంలో విద్యార్థులను చేర్చేందుకు ఇక్కడ చదువుతున్న దాదాపు 300మంది విద్యార్థులను అక్కడికి మార్చాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. పాఠశాలను తరలించాలని చూస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి సోమిరెడ్డిపల్లె నారాయణ, చేజర్ల రవి, ఓబన్న పాల్గొన్నారు.

అట్లూరు: బద్వేలు నియోజకవర్గ పరిధిలోని సగిలేరు గురుకుల పాఠశాలను తరలించడం తగదని కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లా సమత సైనిక్ దళ్ అధ్యక్షుడు చౌడవరం సుబ్బనరసయ్య అన్నారు. ఎన్నో ఏళ్లుగా బద్వేలు నియోజకవర్గంలోని పోరుమామిళ్ల మండలం సగిలేరు గురుకుల పాఠశాలలో బద్వేలు నియోజకవర్గంలోని పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు, బి. కోడూరు, బద్వేలు, గోపవరం, అట్లూరు మండల విద్యార్థులతో పాటు ఉమ్మడి జిల్లా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. అన్ని వసతులతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ పాఠశాల ఉందన్నారు. అలాంటి ఈ పాఠశాలను మైదుకూరు నియోజకవర్గంలోని బి. మఠం మండలం పరిధిలోని తోటపల్లిలో ఉన్న మహా గురుకుల పాఠశాలకు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో సమత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో దళిత సంఘాలతో కలసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

కుక్కల నియంత్రణలో అధికారులు విఫలం

బద్వేలు అర్బన్ : పట్టణంలో రోజు రోజుకి పెరిగిపోతున్న వీధి కుక్కలను నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి.చాంద్‌బాషా, పట్టణ ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్. అబ్దుల్ సత్తార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆవాజ్ కమిటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుక్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. పట్టణంలో ప్రతిరోజు ఎక్కడో ఒక చోట కుక్కలు ప్రజల పైన దాడులు చేసి గాయపరచడం అధికమైందని అన్నారు. దీంతో చిన్నారులు వీధిలో తిరగాలన్న స్కూళ్లకు వెళ్లాలన్నా కుక్కలు భయంతో వణికిపోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కుక్కల బెడద లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఆవాజ్ నాయకులు బాషా, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



డాక్టర్‌ను సన్మానిస్తున్న క్లబ్ కమిటీ సభ్యులు

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల వాసవీక్లబ్, వనితా క్లబ్‌ల సంయుక్తంగా వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. మైదుకూరు ఎస్ఎల్ఆర్ ఆసుపత్రి వైద్యులు అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గుండె జబ్బులు, ఆస్తమా, కొలెస్ట్రాల్, షుగర్ వ్యాధులకు సంబంధించిన రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య సేవలందించిన డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డిని సన్మానించారు. శిబిరంలో 350 మంది రోగులు పాల్గొన్నారని వాసవి క్లబ్ అధ్యక్షుడు మోటపోతుల శివకుమార్ తెలిపారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు విశ్వనాథుల ప్రసాద్, పెద్దశెట్టి సుబ్బారావు, పవన్‌కుమార్, పద్మనాభయ్య, సుబ్రహ్మణ్యం, కృష్ణవేణి, అమ్మణ్ణి, సీతాకుమారి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మౌలానా ఆజాద్ వీధి–2లోని సన్ షైన్ ఆస్పత్రి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్లు నజ్మా బీజాన్, మహ్మద్ ఇర్షాన్ రోగులకు జ్వరం, కాళ్ల నప్పులు, బీపీ, షుగర్ తదితర జబ్బులను పరీక్షించి వైద్య చికిత్సలు అందించారు. వార్షికోత్సవ సందర్భంగా మందులపై 20 శాతం, రక్తపరీక్షలపై 50 శాతం రాయితీ కల్పించారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకుంటాం

బ్రహ్మంగారిమఠం: విద్యుత్తు వినియోగదారుల ఇళ్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడాన్ని అడ్డుకుంటామని సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ తెలిపారు. ఆదివారం బి.మఠంలో పలు గృహాలకు అమర్చిన స్మార్ట్ మీటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలపై విద్యుత్ చార్జీల భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు గోవింద్, సుబ్బమ్మ, అజయ్, దేవా పాల్గొన్నారు.

శాంతి సమాజ నిర్మాణానికి పాటుపడాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: మేధావులు మౌనం వీడి శాంతి సమాజ నిర్మాణానికి పాటుపడాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, కేంద్ర కమిటీ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం సాయంత్రం కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా సంస్థ సమసమాజ స్థాపనే ధ్యేయంగా, కులమతాలకు అతీతంగా సాటి మానవునికి తోడ్పాటు అందిస్తోందన్నారు. మానవత సంస్థ అధ్యక్షుడిగా గడ్డం సాంబశివారెడ్డి, కార్యదర్శిగా అవ్వారు సుబ్బయ్య, కోశాధికారిగా కాంభోజి గంగా శివసాయి తేజ, ఉపాధ్యక్షుడిగా బోడిచర్ల వెంకట సుబ్బరాయుడు, సంయుక్త కార్యదర్శిగా సమ్మెట సత్యనారాయణ, ఈసీ అవేర్‌నెస్‌గా సానా వెంకట సుబ్బన్న, ఈసీ ఎడ్యుకేషన్‌కు కల్లూరు బాల యల్లారెడ్డి, ఈసీ హెల్త్‌కు ప్రతాప్, ఈసీ ఎమెర్జెన్సీకి కందుల వెంకటసుబ్బారెడ్డి ఎన్నిక కాగా వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రచార ఆర్భాటం.. ఆచారణలో విఫలం

- యువతకు అందని బీసీ కార్పొరేషన్ రుణాలు
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

కాశినాయన : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల ప్రచార ఆర్భాటమే తప్పా.. ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేసిన దాఖలాలు లేవు. సూపర్ సిక్స్ పథకాల గురించి అలా ఉంచితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కార్పొరేషన్ రుణాల మంజూరు పేరుతో హడావుడి చేశారు. కానీ క్షేత్రస్థాయిలో కార్యాచరణ రూపుదాల్చలేదు. కారణాలు ఏవైనా బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు ఉత్తుత్తి ప్రచారంగానే మిగిలిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది. అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే రుణాలు అందుతాయని ప్రచారం జరుగుతోంది. దీంతో అర్హులైన వారికి రుణాల మంజూరు ప్రశ్నార్థకంగా మారింది.

ఎంపికలో నాయకుల ప్రమేయం

మండలానికి బీసీ రుణాల కింద 19 యూనిట్లు మంజూరయ్యాయి. మండలంలో 30 గ్రామాలు ఉన్నాయి. 19 యూనిట్లను నరసాపురం ఏపీజీబీ, ఇటుకలపాడు ఏపీజీబీ, పోరుమామిళ్ల ఏపీజీబీ బ్యాంకుల పరిధిలో రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. ఎన్నో ఆశలతో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంత వరకు రుణాలు మంజూరు చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. 19 యూనిట్లకు గాను 175 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిరుద్యోగులు దరఖాస్తుకు రూ.500 ఖర్చు పెట్టి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత శాఖాధికారులు ఫిబ్రవరి నెలలో ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. అయితే రాజకీయ నాయకుల అండదండలు ఉన్న వారికి మాత్రమే మంజూరు చేయాలని అధికార పార్టీ నాయకులు మౌఖికంగా ఆదేశించడంతో ఇంత వరకు రుణాలు మంజూరు కాలేదు. సబ్సిడీ రుణాలు వస్తే చిన్న పాటి వ్యాపారం పెట్టుకుని జీవనం సాగించాలని ఆశిస్తున్న వారు నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అర్హులైన వారికి సబ్సిడీ రుణాలు అందించాలని వారు కోరుతున్నారు.

> **జాబితాను పంపించాం**
>
> రెండు నెలల క్రితం బీసీ కార్పొరేషన్ల రుణాలకు సంబంధించి నిర్వహించిన ఇంటర్వ్యూల జాబితాను సంబంధిత బ్యాంకు అధికారులకు, జిల్లా అధికారులకు పంపాం. అక్కడి నుంచి మంజూరు జాబితా వచ్చిన వెంటనే ఎంపిక చేసిన వారికి రుణాలు మంజూరు చేస్తాం.
>
> – మైథిలి, ఎంపీడీఓ, కాశినాయన మండలం